క్లుప్తంగా

నేటి నుంచి పశువైద్య శిబిరాలు

వాకాడు: మండలంలో సోమవారం నుంచి 31 వరకు పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పశువైద్యశాల ఏడీ డి.రమణయ్య తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో పశువుల్లో సోకుతున్న వివిధ రకాల వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యులను సంప్రదించి పశువులకు చికిత్స చేయించాలన్నారు. గ్రామాల్లో నిర్వహించే పశువైద్య శిబిరాల్లో రైతులకు అవగాహన కల్పించడంతోపాటు పశువులకు చికిత్స చేసి మందులు అందజేస్తామన్నారు.

పిల్లలకు వేమన పద్యాలు నేర్పాలి

నాయుడుపేట టౌన్: పిల్లలకు వేమన పద్యాలు నేర్పించి అందులో జ్ఞానాన్ని వివరించాలని త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి సభ్యులు కోరారు. వారు ఆదివారం నాయుడుపేట మండలంలోని విన్నమాల, పుదూరు, మిట్టకండ్రిగ, అత్తలపాళెం, మాలయకోట, బిరదవాడ, మర్లపల్లి అన్నమేడు తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు. త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి అధ్యక్షుడు డి.సురమౌళి, సభ్యులు ధనలక్ష్మీ, నారాయణమ్మ, శేఖర్, శ్రీదేవి, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

బీఎన్‌కే యూత్ క్రికెట్ విజేత సూళ్లూరుపేట



బుచ్చినాయుడుకండ్రిగ: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని బుచ్చినాయుడుకండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బీఎన్‌కే యూత్ ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్ టోర్నీ విజేతగా సూళ్లూరుపేట జట్టు నిలిచింది. ఆ జట్టుకు రూ.20 వేల నగదు, ట్రోఫీ, రన్నర్‌గా నిలిచిన నీర్పాకోట జట్టుకు రూ.10 వేల నగదు, ట్రోఫీని నిర్వాహకులు తిరుమల, దొరై, అఖిల్ అందజేశారు.

గొబ్బెమ్మ ఊరేగింపు



రాపూరు: మండల కేంద్రమైన రాపూరులోని పరమటి అగర్తలో ఏర్పాటు చేసిన గొబ్బెమ్మకు ఆదివారం గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గొబ్బెమ్మను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో కొలువుదీర్చి విశేషంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని మహిళలు తలపై ఉంచుకుని తప్పెట్లు, తాళాలతో గొబ్బి పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా తీసుకెళ్లి పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు.

దుప్పట్ల పంపిణీ



చిల్లకూరు: మండలంలోని నెలబల్లిరెట్టపల్లి పంచాయతీ నక్కలకాలువ కండ్రిగ గిరిజనులకు ఆదివారం గూడూరుకు చెందిన కృపా సేవా చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు కటకం శ్రీనివాసులు దుప్పట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ గిరిజనులు చలికాలంలో ఇబ్బంది పడుతుండడాన్ని గుర్తించామన్నారు. వారికి గూడూరుకు చెందిన షేక్ బాషా, షేక్ బషీరా దంపతుల దాతృత్వంతో దుప్పట్లు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు అత్తిమంజిరి గోపాల్, పర్వతాల రమేష్, రమణయ్య, గురవయ్య, శంకరయ్య, చెంచయ్య, ఈశ్వరయ్య, సురేంద్రబాబు, తిరుమల శెట్టి మౌనిక పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



గూడూరు రూరల్ : గూడూరులోని సొసైటీ ప్రాంతంలో వెలసిరన నారాయణమ్మ పేరంటాల ఆలయంలో ఆదివారం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. సంక్రాంతి పండుగ అనంతరం వచ్చే ఆదివారం భక్తులకు అన్నదానం చేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. తదుపరి భారీ ఎత్తున అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా బోగనాదుల శోభన్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

సూళ్లూరుపేట: ఫ్లెమింగో ఫెస్టివల్‌లో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు స్థానికులు నెల్లూరు, తిరుపతి జిల్లాలకు చెందిన కళాకారులు నృత్య ప్రదర్శనలు చేశారు. ప్రముఖ సినీ నటి, యాంకర్ అనసూయ, రేణు, ఐషూరెడ్డి యాంకరింగ్ చేశారు. ప్రముఖ సినీ సంగీత దర్శకుడు రఘు కుంచె గ్రూప్‌లో సింగర్స్ రఘురామ్, శ్రీనివాస్ దరిమిశెట్టి, శృతి, గాయత్రి సంగీత విభావరీ చేపట్టారు. షరీఫ్ చేసిన మిమిక్రీ ఎంతో ఆకట్టుకుంది. ఢీ ఫ్రేమ్ డ్యాన్సర్ తేజస్విని నృత్యాలు అలరించాయి.

సర్పంచుల అధికారాలకు తూట్లు

అధికారం అండ ఉంటే చాలు ఏమైనా చేయొచ్చని కూటమి నేతలు నిరూపిస్తున్నారు. అధికారిక కార్యక్రమాల్లో యథేచ్ఛగా పాల్గొంటూ ప్రజాస్వామ్యాన్ని సమాధి చేస్తున్నారు. అధికారులు వారికి వత్తాసు పలుకుతూ జీ హుజూర్ అంటున్నారు. ముఖ్యంగా స్థానిక ప్రజా ప్రతినిధులను లెక్క చేయడం లేదు. వారి అధికారాలకు తూట్లు పొడుస్తున్నారు. సర్పంచులకు తెలియకుండానే నేరుగా నిధులను మంజూరు చేసుకుని తూతూమంత్రంగా పనులు చేసి ప్రజా ధనాన్ని స్వాహా చేస్తున్నారు.

- కూటమి నాయకులకే ప్రాధాన్యత
- వారికే వత్తాసు పలికిన అధికారులు



చిల్లకూరు: సర్పంచ్ లేకుండా కూటమి నేతలతో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సు (ఫైల్)

చిల్లకూరు: గూడూరు నియోజకవర్గంలో గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాలు ఉన్నాయి. వాటిలో 112 పంచాయతీలు ఉన్నాయి. స్థానికంగా ఏదైనా ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించినా, అభివృద్ధి పనులు చేసినా సర్పంచుల ఆధ్వర్యంలోనే చేపట్టాలి. అదేవిధంగా మండల ప్రాదేశిక నియోజకవర్గాల్లో ఎంపీటీసీలకు కనీస ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆ పార్టీ నాయకులు సర్పంచులు, ఎంపీటీసీలకు కనీస ప్రాధాన్యత ఇవ్వడం లేదు. అభివృద్ధి పనుల వివరాలను కూడా సర్పంచులకు తెలియజేయ లేదు. నిధులు మంజూరు చేయించుకుని తమకు అనుకూలమైన పనులు చేసుకుంటున్నారు. దీంతో సర్పంచులు, ఎంపీటీసీలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది సర్పంచులు, ఎంపీటీసీలు తమ పబ్బం గడుపుకునేందుకు గతంలో గెలిచిన పార్టీని కాదని కూటమి ప్రభుత్వంలో చేరి పనులు చేసుకుంటున్నారు. గ్రామాల్లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల్లో స్థానిక సర్పంచులు పాల్గొనాల్సి ఉన్నప్పటికి నియోజకవర్గ స్థాయి ప్రజా ప్రతినిధి తమ వారినే పిలవాలని అధికారులకు మౌఖిక ఆదేశాలు ఇస్తున్నారు.

పల్లె పండుగలోనూ లేని ప్రాధాన్యత

ఇటీవల ఉపాధి హామీ పథకం నిధులతో పంచాయతీల్లో పల్లె పండుగ పేరుతో సీసీ రోడ్లు, క్యాటిల్ షెడ్ల నిర్మాణ పనులు చేపట్టారు. వీటిలోనూ సర్పంచులకు ప్రాధాన్యత ఇవ్వలేదు. కూటమి నేతలు సూచించిన వీధిలో సీసీరోడ్లు వేసుకున్నారు. నాణ్యత పాటించకుండా తూతూమంత్రంగా పనులు చేసి జేబులు నింపుకున్నారు. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లోనూ సర్పంచులకు ప్రాధాన్యత ఇవ్వలేదు. అధికారులు కూటమి నాయకులను వేదికపై కూర్చొబెట్టి స్వామి భక్తిని చాటుకున్నారు. ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో ఎన్నికల్లో గెలవకుండానే పెత్తనం చేయవచ్చన్న ధీమా సంబంధిత అధికార పార్టీ నేతల్లో కలుగుతుందని ప్రజలు వాపోతున్నారు.

పట్టించుకోవడం లేదు



పంచాయతీలో ఏ పని చేయాలన్నా సర్పంచ్ అనుమతి తప్పనిసరి. కూటమి ప్రభుత్వం వచ్చాక నాకు కనీస సమాచారం కూడా ఇవ్వకుండా నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సీసీరోడ్లను వారికి కావాల్సిన ప్రాంతాల్లో వేసుకున్నారు. అధికారులను ఇళ్ల వద్దకు పంపి బిల్లులపై సంతకాలు చేయించుకుంటున్నారు. –పోచారెడ్డి ఈశ్వరరెడ్డి, అల్లంపాడు సర్పంచ్, కోట

సమావేశాల్లో చెప్పినా ఫలితం లేదు



మా ప్రాంతంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సమావేశాల్లో అధికారులను కోరినా ఫలితం లేదు. మీ గ్రామంలోని కూటమి నాయకులను కలవాలని అధికారులు చెబుతున్నారు. గిరిజన కాలనీల్లో పనులు చేసేందుకు కూడా అధికార పార్టీ నాయకుల అనుమతి తీసుకోవాలని అంటున్నారు. ఇలా అయితే ప్రజలకు ఏమి సమాధానం చెప్పాలి.

– పోలయ్య, అరవపాళెం ఎంపీటీసీ, చిట్టమూరు

కనీస సమాచారం కూడా ఇవ్వడం లేదు



కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి సర్పంచులకు కనీస సమాచారం ఇవ్వకుండానే కార్యక్రమాలు చేస్తున్నారు. దళిత సర్పంచులకు కనీసం గౌరవం ఇవ్వడం లేదు. ఇటీవల పల్లె పండుగ కింద మా పంచాయతీకి మండలంలోనే అధిక శాతం నిధులు మంజూరయ్యాయి. రోడ్లు ఎక్కడ వేస్తున్నారన్న విషయం కూడా మాకు చెప్పలేదు.

–దారా వెంకటరమణయ్య, వల్లివేడు సర్పంచ్, చిల్లకూరు

అంతా వారి ఇష్టంగా మారింది

అధికార పార్టీ నాయకులు చెప్పినట్టే పంచాయతీలో పనులు చేయాల్సి వస్తోంది. ఎన్నికల్లో గెలిచిన మేము ప్రతిపాదించిన ఒక్క పనిని కూడా చేపట్టడం లేదు. అధికారులు కూడా అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలుకుతున్నారు. ఈ విషయాలను ఉన్నతాధికారులకు తెలియజేస్తే సర్దుకుపోండని ఉచిత సలహా ఇస్తున్నారు.

–ఏనుగు పుష్ప, కొండాపురం సర్పంచ్, వాకాడు

షాడోలతోనే పనులు

వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరి నియోజకవర్గంలోని పంచాయతీల్లో సర్పంచుల ప్రమేయం లేకుండానే కూటమి నేతలు గ్రామాల్లో పనులను షాడోలతో చేయించుకుటున్నారు. సర్పంచులకు కనీస గౌరవం కూడా ఇవ్వడం లేదు. వెంకటగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని 143 పంచాయతీలు ఉన్నాయి. వాటిలో సీసీరోడ్లకు ఉపాధి హామీ నుంచి రూ.10 కోట్ల పైగానే నిధులు మంజూరయ్యాయి. పనులు చేపట్టడంలో సర్పంచులకు కనీస సమాచారం ఇవ్వకుండానే కూటమి నేతలు తమకు కావాల్సిన వారితో చేయించుకున్నారు. డక్కిలి ఎంపీడీవో కార్యాలయానికి కూత వేటు దూరంలో పాత సీసీ రోడ్ల పైనే కొత్త సీసీ రోడ్లు నిర్మాణ పనులు చేపట్టారు. ఎన్నో ఏళ్లగా బురద వీధుల్లో ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోకుండా డక్కిలిలో పాత పంచాయతీ కార్యాలయం నుంచి ఒక ఇంటి వరకు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు వేసినట్టు స్థానికులు వాపోతున్నారు.



డక్కిలి ప్రాథమిక పాఠశాల పక్క వీధిలో పాత సీసీ రోడ్డుపై వేసిన సీసీ రోడ్డు

అధికారాలను నిర్వీర్యం చేస్తోంది



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సర్పంచుల అధికారాలను నిర్వీర్యం చేస్తోంది. మా ప్రమేయం లేకుండానే కూటమి నేతలు పనులు చేయిస్తున్నారు. ప్రజలు గెలిపించిన మాకు కనీస గౌరవం కూడా ఇవ్వడం లేదు. ఎన్నికల ముందు సర్పంచులకు ప్రత్యేక అధికారాలు ఇస్తామంటే ఏమో అనుకున్నాం.

–తుమ్మూరు మస్తాన్ అమ్మపాళెం సర్పంచ్, వెంకటగిరి

తెలుగు తమ్ముళ్లకే పనులు



నాయుడుపేట మండలం చిగురుపాడు అగ్రహారం ఎస్సీకాలనీలో వేసిన సీసీ రోడ్డు

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 128 పంచాయితీలున్నా యి. సర్పంచులకు పనుల్లో ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వకుండా కూటమి నేతలతోనే చేయిస్తున్నారు. ప్రస్తుతం ఉపాధి నిధులతో పంచాయతీల్లో సిమెంట్ రోడ్లు వేస్తున్నారు. నియోజకవర్గంలోని 128 పంచాయతీల్లో 158 సీసీ రోడ్ల పనులకు రూ.10.49 కోట్లు మంజూరు చేశారు. పనులను సర్పంచుల ప్రమేయం లేకుండా కూటమి నాయకులే చేసి నిధులను స్వాహా చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

సర్పంచి తీర్మానం లేకుండా రోడ్లు వేశారు



సర్పంచి తీర్మానం లేకుండానే ఇలుపూరు పంచాయ తీ పెరిమిటిపాడులో టీడీపీ నేతలు సీసీ రోడ్డు వేశారు. సర్పంచులకు పూర్తిస్థాయి అధికారాలు కల్పిస్తామని ఎన్నికల్లో చెప్పిన కూటమి ప్రభుత్వం మాట తప్పడం సరికాదు. వైఎస్సార్ సీపీకి చెందిన సర్పంచులున్న చోట టీడీపీ నేతలు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు.

– తేరే కృష్ణయ్య, ఇలుపూరు సర్పంచ్, సూళ్లూరుపేట

మాతో పనిలేకుండానే సీసీ రోడ్లు వేశారు



మాకు తెలియకుండానే వెదురుపట్టు పంచాయతీలో సీసీరోడ్లు వేసుకున్నారు. కూటమి నేతలకు పనులు అప్పగిస్తున్నారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికల్లో గెలిచిన మాకు కనీస గౌరవం ఇవ్వడం లేదు. పంచాయతీ తీర్మానం లేకుండానే ఇష్టం వచ్చిన చోట పనులు చేసుకోవడం దారుణం.

– ఎస్.మధురెడ్డి, వెదురుపట్టు సర్పంచ్, దొరవారిసత్రం

పంట మునిగిపోయిందని రైతు ఆవేదన



నీటిలో మునిగిపోయిన వరి పంట

చిల్లకూరు: గుంతను ఆక్రమించుకునేందుకు అందులో ఉన్న నీటిని వదిలేయడంతో తన పొలంలోని పంట పూర్తిగా మునిగిపోయిందని పొన్నవోలు గ్రామానికి చెందిన రామచంద్రయ్య వాపోయాడు. ఆయన ఆదివారం పంటను చూసి కన్నీటి పర్యంతమయ్యాడు. రామచంద్రయ్య అదే గ్రామానికి చెందిన రైతు పొలాన్ని కౌలుకు తీసుకుని వరి పంట సాగు చేసుకుంటున్నాడు. ఆ పొలానికి ఎగువ ప్రాంతంలో ఉన్న గుంతను ఆక్రమించుకునేందుకు ఒక వ్యక్తి ప్రయత్నించాడు. ఇందులో భాగంగా యంత్రాలతో గుంతను పూడ్చేసి అందులో ఉన్న నీటిని కిందకు వదిలేశాడు. దీంతో రామచంద్రయ్య పొలంలోని వరిపంట పూర్తిగా మునిగిపోయింది. ఈ విషయాన్ని నీటి పారుదల, రెవెన్యూ అధికారులకు తెలిపినా ఫలితం లేదు. ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకుని పంట దెబ్బతిన్న తనకు న్యాయం చేయాలని కోరాడు.

బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

చిల్లకూరు: నేడు యువతీ యువకులు ఫ్యాషన్ రంగంపై మక్కువ చూపుతున్నారని, దీనిపై శ్రద్ధ చూపితే నిరుద్యోగులు ఆదాయం పొందవచ్చని సునీత సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మీ తెలిపారు. గూడూరులోని సంస్థ కార్యాలయంలో ఆదివారం యువతులకు బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఖాళీగా ఉన్న యువతులు బ్యూటీషియన్ కోర్సు పూర్తి చేసుకుని బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని చిన్నపాటి సెలూన్ ఏర్పాటు చేసుకుంటే ఉపాధి పొందవచ్చన్నారు. ఈ కోర్సు బయట నేర్చుకోవాలంటే సుమారు రూ.25 వేల వరకు ఖర్చు అవుతుందన్నారు. తాము ఉచితంగా నేర్పించి సర్టిఫికెట్ కూడా అందజేస్తున్నట్టు వివరించారు. కోర్సులో చేరాలనుకునే వారు నేరుగా గానీ, 9440455947లో గానీ సంప్రదించాలని కోరారు.

అమిత్‌షా గోబ్యాక్

చిల్లకూరు: అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించి నిరుద్యోగులను మోసం చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షా ఆంధ్రప్రదేశ్ నుంచి వెళ్లిపోవాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. వారు ఆదివారం గూడూరు టవర్ క్లాక్ సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద అమిత్‌షా గోబ్యాక్ అంటూ నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఆంధ్ర హక్కుగా భావించే విశాఖ ఉక్కును ప్రైవేటీకరించేందుకు కుట్ర చేస్తోంది. ఇప్పటికైనా విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం చేయకుండా రక్షించాలని, దానికి సొంత గనులు కేటాయించాలని కోరారు. జోగి శివకుమార్, రామిరెడ్డి, సురేష్, అడపాల ప్రసాద్, నరసింహులు, శశికుమార్, మస్తానయ్య, ఎంబేటి చంద్రయ్య పాల్గొన్నారు.

21న ప్రజల పక్షాన పోరుబాట

పెళ్లకూరు: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు ఈ నెల 21న ప్రజల పక్షాన మండలంలోని రోసనూరులో పోరుబాట చేపడుతున్నట్లు డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలుచేయాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పోరుబాటను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పెట్రోల్‌లో నీరు కల్తీ

- బాధితుడి గగ్గోలు
- బంక్ సిబ్బంది నిర్లక్ష్య సమాధానం

నాయుడుపేట టౌన్ : నాయుడుపేటలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న పెట్రోల్ బంక్‌లో పెట్రోల్‌లో నీరు కల్తీ అయినట్టు చిట్టమూరు మండలం రామాపురానికి చెందిన మాతయ్య ఆరోపించాడు. అతను ఆదివారం సొంత పనిమీద బైక్‌లో నాయుడుపేటకు బయలుదేరాడు. పట్టణ సమీపంలో పెట్రోల్ అయిపోయి బండి నిలిచిపోయింది. జాతీయ రహదారి కూడలి వద్ద ఉన్న పెట్రోల్ బంక్‌లో పెట్రోలు పట్టించుకున్నాడు. కొద్ది దూరం వెళ్లే సరికి బైక్ నిలిచిపోయింది. మెకానిక్ షెడ్డు వద్దకు తీసుకెళ్లి చూడగా పెట్రోల్‌లో నీరు కలిసినట్టు గుర్తించాడు. ఈ విషయమై బాధితుడు పెట్రోల్ బంక్ వద్దకు వెళ్లి సిబ్బందిని ప్రశ్నించాడు. వారు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతోపాటు దురుసుగా ప్రవర్తించారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు మాతయ్య తెలిపాడు. సంబంధిత పెట్రోల్ బంకులో పెట్రోల్‌లో కల్తీ జరిగినట్టు గతంలో కూడా పలు ఫిర్యాదులు ఉన్నాయి. అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

విజేతలకు బహుమతులు



సైదాపురం: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని వేములచేడు, కృష్ణారెడ్డిపల్లి గ్రామాల్లో వేర్వేరుగా నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో వివిధ జట్లు పాల్గొన్నాయి. ఆదివారం పొక్కందల, వేములచేడు జట్లు తలపడ్డాయి. పొక్కందల జట్టు విజేతగా నిలిచింది. కృష్ణారెడ్డిపల్లి, తూమాయి జట్ల మధ్య జరిగిన పోటీల్లో రాపూరు మండలంలోని తుమాయి జట్టు విజయం సాధించింది. విజేతలకు తాతయ్య స్వామి బహుమతి ప్రదానం చేశారు.

కోడిపందెం స్థావరాలపై దాడులు

కోట: మండలంలోని తీరప్రాంతం దొరువుకట్ట వద్ద కోడి పందెం ఆడుతున్న 12 మందిని అరెస్టు చేసినట్టు కోట, వాకాడు ఎస్‌ఐలు పవన్‌కుమార్, నాగబాబు తెలిపారు. వారు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ముందుగా అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి దాడులు చేసినట్టు తెలిపారు. 12 మంది పందెం రాయుళ్లను అరెస్టు చేసి పది కోళ్లు, రూ.10 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

కిక్కిరిసిన పక్షుల కేంద్రం



దొరవారిసత్రం: చెరువు కట్టపై వ్యూ పాయింట్ వద్ద సందర్శకుల రద్దీ

- ఆదివారం కావడంతో తరలివచ్చిన పక్షి ప్రేమికులు
- విహంగాల విన్యాసాలకు చిన్నారుల కేరింతలు
- గంటల తరబడి ఆగిన ట్రాఫిక్



దొరవారిసత్రం: పక్షులను వీక్షించేందుకు భారీగా విచ్చేస్తున్న సందర్శకులు

దొరవారిసత్రం/సూళ్లూరుపేట రూరల్/సూళ్లూరుపేట : ప్రకృతి అందాలు, పక్షుల విన్యాసాలను వీక్షించేందుకు ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో సందర్శకులు, పర్యాటకులు, పక్షి ప్రేమికులు తరలిరావడంతో దొరవారిసత్రం మండలంలోని నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం, సూళ్లూరుపేట మండలంలోని అటకానితిప్ప వద్ద ఉన్న పర్యావరణ విజ్ఞాన కేంద్రంలో ఉన్న పక్షుల చిత్రాల మ్యూజియం, పులికాట్ సరస్సు కిటకిటలాడాయి. సందర్శకుల కోసం పులికాట్ సరస్సు వద్ద మూడు వ్యూ పాయింట్లు ఏర్పాట్లు చేసి బైనాక్యూలర్స్‌ను అందజేస్తున్నారు. పక్షుల విజ్ఞాన కేంద్రంలో పిల్లలకు చిల్డ్రన్స్ పార్కుతో పాటు వీడియో చిత్రాల ద్వారా ప్రదర్శనలు నిర్వహించారు. సముద్ర తాబేలు స్టాల్ అందరినీ ఆకట్టుకుంటోంది. విద్యార్థులకు ఉచిత బస్సులు ఏర్పాటు చేయడంతో అటకానితిప్ప కేంద్రం కిటకిటలాడుతోంది.

అలరించిన గూడబాతుల విన్యాసాలు

నేలపట్టు పక్షుల కేంద్రంలోని చెరువుల్లో ఉన్న గూడబాతుల విన్యాసాలు చిన్నపెద్దా తేడలేకుండా అందరినీ ఆకట్టుకున్నాయి. వ్యూపాయింట్ల రద్దీ కనిపించింది. మార్గమధ్యంలోని జింకల పార్కులోని చుక్కల జింకలు, పంజరంలోని చిలుకలను చూసేందుకు విద్యార్థులు పోటీపడ్డారు.

డీవీ సత్రం నుంచి స్తంభించిన ట్రాఫిక్

ఆదివారం మధ్యహ్నం ఉన్నట్టు ఉండి బయట ప్రాంతాల నుంచి వందల కార్లు ఒక్కసారిగా రావడంతో డీవీ సత్రం నుంచి పక్షుల కేంద్రం ప్రధాన గేట్ల వరకు ట్రాఫిక్ స్తంభించింది. కొంతమంది పర్యాటకులు వెనుతిరికి వెళ్లిపోయారు. జేసీ శుభం బన్సల్ ఆదివారం నేలపట్టులోని పక్షుల కేంద్రాన్ని పరిశీలించారు. విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం కొన్ని అడ్డంకుల వల్ల ప్రదర్శనలు నిర్వహించలేకపోయామన్నారు. మరోసారి పక్షుల పండుగ నిర్వహిస్తే సందర్శకుల కోసం ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆయన వెంట ఎఫ్‌ఆర్‌వో సౌజన్య, తహసీల్దార్ శైలకుమారి, వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, సర్పంచ్ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, ఎమ్మెల్యే బోటు షికారు

తడ: ఫ్లెమింగో ఫెస్టివల్ రెండో రోజు ఆదివారం బీవీపాళెం పడవల రేవుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ఇతర అధికారులు, నాయకులతో కలిసి పులికాట్ సరస్సుపై బోటు షికారు చేశారు. సెలవు దినం కావడంతో ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావడంతో లైఫ్ జాకెట్లు లేకుండానే పడవ ప్రయాణానికి అనుమతించారు. వాహనాలను గ్రామంలోకి వెళ్లకుండా జాతీయ రహదారి వద్దనే పోలీసులు నిలిపి వేయడంతో ప్రజలు ఇబ్బంది పడాల్సి వచ్చింది.



దొరవారిసత్రం: చెరువులో గూడబాతుల విన్యాసాలు



తడ: రైల్వే గేటు వద్ద నిలిచిపోయిన వాహనాలు

వైస్ ఎంపీపీకి పరామర్శ



పెంచలరెడ్డిని పరామర్శిస్తున్న మధుసూదన్‌రెడ్డి

రాపూరు: బైపాస్ సర్జరీ చేసుకుని సిద్ధవరంలో విశ్రాంతి తీసుకుంటున్న రాపూరు వైస్ ఎంపీపీ పోలంరెడ్డి పెంచలరెడ్డిని ఆదివారం వైఎస్సార్ సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ పాపకన్ను మధుసూదన్‌రెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ బొడ్డు మధుసూదన్‌రెడ్డి, దుగ్గిరెడ్డి నరసింహారెడ్డి, మల్లిరెడ్డి సంజీవరెడ్డి, పింగాణి నారాయణరెడ్డి, కలపాటి మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అది పులికాదు జంగు పిల్లి!

చిల్లకూరు: మండలంలోని తూర్పుకనుపూరు పంచాయతీ పోసినవారిపాళెం శివారులో ఆదివారం సాయంత్రం కనిపించిన పాదముద్రలు పులివి కాదని, జంగు పిల్లివని అధికారులు తేల్చారు. అంతకుముందు పులి సంచారమని ప్రచారం కావడంతో స్థానికులు భయాందోళన చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు, అటవీశాఖ అధికారులు గ్రామానికి చేరుకున్నారు. పాద ముద్రలను పరిశీలించి జంగు పిల్లివని, కుక్కను చంపి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. అటవీ ప్రాంతంతోపాటు సముద్ర తీరం వరకు సోమవారం గాలింపు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. చేపడతామని వారు తెలిపారు.